క్లుప్తంగా

పాఠశాలకు సామగ్రి అందజేత



సామగ్రితో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్ : పట్టణ పరిధిలోని చింతలచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గురువారం గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పొందిన డాక్టర్ పెండెం కృష్ణకుమార్ వివిధ రకాల సామగ్రిని పాఠశాల హెచ్ఎంకు అందజేశారు. దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, వాటర్‌క్యాన్, ఆట వస్తువులు, గోడ గడియారం, వరల్డ్ మ్యాప్స్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కోమటిరెడ్డి బోజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు క్రీడా సామగ్రి, దేశభక్తిని పెంపొందించడానికి దేశ నాయకుల చిత్రపటాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, బాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని డీఎల్‌పీఓ సాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతిరోజు పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలను లక్ష్యానికి అనుగుణంగా పెంచాలన్నారు. పల్లెప్రకృతి వనాల్లో మొక్కలను సంరక్షించాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి హుస్సేన్ ఉన్నారు.

లంబాడీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పరదేశ్‌నాయక్



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న పరదేశ్‌నాయక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపర్రెతండాకు చెందిన భూక్యా పరదేశ్‌నాయక్ తెలంగాణ రాష్ట్ర లంబాడీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని స్థానిక తెలంగాణ చౌరస్తాలోని అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్, రమేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జమ్మిలాల్, 1వవార్డు కౌన్సిలర్ భాస్కర్, హీరూనాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 5వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గిరిజన సంక్షేమ గురుకులాల రీజియన్ కోఆర్డినేటర్ కె.లక్ష్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి మార్చి- 2024లో పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే గిరిజన బాల, బాలికలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. www.tgtwgurukulam.telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9121174434ను సంప్రదించాలని కోరారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి 5న భూమిపూజ

తుంగతుర్తి : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఈనెల 5న భూమి పూజ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తిలో రూ.45కోట్లతో వంద పడకల ఆస్పత్రి ని ర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణానికి కావాల్సిన నిధులు సైతం విడుదలయ్యాయని, భూ మిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ప్రకటనపై హర్షం

అర్వపల్లి : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాలు అన్నింటిని ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల తెలంగాణ ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మచ్చ నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని గురుకుల విద్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తుండటంతో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి సొంత భవనాలను నిర్మించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలేవీ?

- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



చీదెళ్ల గ్రామశివారులో రహదారి వెంట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



చెట్లముకుందాపురంలో చేతికందె ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పెన్‌పహాడ్ : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. చాలా చోట్ల ఇళ్లకు దగ్గరలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటికి ఏలాంటి రక్షణ కంచె ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నారు. ప్రమాదకరమైన నేపథ్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై ఆ శాఖ అధికారులు దృష్టి పెట్టడం లేదు. గ్రామాలతో పాటు వ్యవసాయ పొలాలు, రోడ్ల పక్కన ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు రింగులపై ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో చిన్నారులకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిత్యం వాహనాలు తిరిగే రహదారిపై ఎప్పుడు ఏలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గాజులమల్కాపురం నుంచి చీదెళ్ల గ్రామానికి వెళ్లే రహదారి మూల మలుపు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అనంతారం నుంచి పెన్‌పహాడ్ వెళ్లే రహదారుల పక్కన, చెట్లముకుందాపురం నుంచి తిమ్మారెడ్డిగూడెం వెళ్లే రహదారి వెంట స్తంభానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో పలువురు రైతులు తమ మూగజీవాలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలి. రక్షణ లేకపోవడంతో గ్రామంలో పలు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించి రక్షణ వలయాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలి.

– వెంకన్న, చీదెళ్ల

ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ఆదేశాలు వచ్చిన వెంటనే వాటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడతాం.

– పావని, విద్యుత్ ఏఈ

గద్దర్ సాంస్కృతిక కళా కేంద్రం నిర్మించాలి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ప్రజా కళాకారుడు గద్దర్ పేరున హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గద్దర్ సాంస్కృతిక కళా కేంద్రం నిర్మించాలని మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తళ్లమళ్ల హసేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆయన పేరున కళాకారులకు జీవిత పురస్కార అవార్డు ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బోడ శ్రీరాములు, వసంత సత్యనారాయణపిళ్లై, ఏడిండ్ల అశోక్, వెంకటరత్నం, బోయిల అఖిల్, గుండాల సందీప్‌యాదవ్, పంతం యాకయ్య, నాగలక్ష్మి, గుండా రమేష్, నాగేందర్‌నాయక్, నామ నాగయ్య, ధైద వెంకన్న, పుట్టల మల్లేష్, కళ్యాణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించిన వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆత్మకూర్ (ఎస్) : పట్టా భూమితో పాటు డొంక దారి 6ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఓ బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు చల్లా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. భూమి భాగాల పంపిణీలో భాగంగా వివాదం, కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ సూర్యాపేట పట్టణానికి చెందిన సవరాల సత్యనారాయణ అనే వ్యక్తి ఇతర రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు కాగితాలు సృష్టించి అక్కడి రైతులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు బాధిత రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భాగ పంపిణీలో తనకు వచ్చిన మూడెకరాలను, ప్రభుత్వ భూమి ఆరు ఎకరాలను సత్యనారాయణ అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని, అధికారంలో ఉన్న సమయంలో అధికారులను అడ్డం పెట్టుకొని భూమి చుట్టూ కంచె వేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా సత్యనారాయణపై చర్యలు తీసుకుని తనకు రావాల్సిన భూమిని ఇప్పించాలని, ప్రభుత్వ భూమిని కాపాడాలని రైతు వెంకటేశ్వర్లు కోరారు. ఈ విషయమై బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణను వివరణ కోరగా.. స్థానికుల వద్ద 19ఎకరాల భూమి కొనుగోలు చేశామని, ప్రభుత్వ భూమిని అక్రమించలేదన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



డిపాజిట్ పత్రాన్ని అందిస్తున్న హెడ్ పోస్టాఫీసర్, యూనియన్ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : పోస్టల్ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూర్యాపేట హెడ్ పోస్ట్ ఆఫీసర్ బొజ్జ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్బుల్స్ అండ్ పాలిష్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ తరపున అకాల మరణం చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. బొజ్జ రాంబాబు కుటుంబానికి రూ.51వేలు, పల్లె బిక్కు కుటుంబానికి రూ.50వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తోటి కార్మికుడు మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని పోస్టల్ శాఖ కార్మికులు, ప్రజలకు అనువైన పథకాలను అందిస్తుందని, వాటిలో చేరితే అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా ఉండే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ సిరపంగి బాలకృష్ణ, కోశాధికారి సురేష్, గౌరవ అధ్యక్షుడు గ్యార శ్రీను, యూనియన్ సభ్యులు గ్యార విజయ్, నరసింహ, ప్రభాకర్, శ్యామ్, కమల్, రాజు, రమణ, బాలకృష్ణ, ఒగ్గు నాగరాజు, సుధాకర్, సుందర్, మధు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ ఏఎస్ఐ పాండునాయక్

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఏఎస్ఐ పాండునాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం ఆట పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జాఫర్, ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ సీహెచ్.నర్సింహారావు, యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ప్రత్యేక అధికారుల నియామకం

ఆత్మకూరు (ఎస్) : గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండలంలోని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని 30 గ్రామపంచాయతీల గాను 14మంది గెజిటెడ్ అధికారులను నియమించింది. నెమ్మికల్, గట్టికల్, పీపానాయక్ తండాలకు ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఆత్మకూర్ ఎస్, బోరింగ్ తండా గ్రామాలకు తహసీల్దార్ సీహెచ్.కృష్ణయ్య, తుమ్మల పెన్‌పహాడ్, బొట్యాతండాలకు ఎంపీఓ సంజీవయ్య, పాత సూర్యాపేట, దుబ్బతండాలకు మండల వ్యవసాయ అధికారి డి.దివ్య, కందగట్ల, మంగలితండాలకు ఎంఈఓ ధారాసింగ్, బొప్పారం, ఏపూరు తండాలకు డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఏపూరు, ఖాసింగూడెం సబ్‌స్టేషన్లకు పంచాయతీరాజ్ ఏఈఈ బాబురావు, పాతర్లపహాడ్, కొత్తతండాలకు పశువైద్యాధికారి వేణుగోపాలరావు, కోటపహాడ్, శెట్టిగూడెం, అస్లంతండాలకు పశు వైద్యాధికారి ఏ.వెంకన్న, రామన్నగూడెం, రామోజీతండాలకు ఇరిగేషన్ డీఈఈ నగేష్, ముక్కుడుదేవులపల్లి, ఇస్తాళపురం గ్రామాలకు ఇరిగేషన్ ఏఈఈ రామారావు, మక్త కొత్తగూడెం, మిడతనపల్లి గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్, దాచారం, నశీంపేట గ్రామాలకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ.వెంకటేశ్వర్లు, ఏనుబాముల, కోటినాయక్ తండాలకు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డిని ప్రత్యేక అధికారులుగా నియమించింది.

అల్పాహారం అందించడం అభినందనీయం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఎంఈఓ బాలునాయక్, దాతలు

అర్వపల్లి : పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సందర్భంగా అల్పాహారం అందించడం అభినందనీయమని ఎంఈఓ బి.బాలునాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో దాతలు దాసరి సోమయ్య, కుంభం రాంమ్మూర్తి, ఎల్లంల కొమిరెల్లి, కర్నాటి రంగయ్య, బింగి కృష్ణమూర్తి, పద్మనాభస్వామి, కీర్తి వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి సత్యనారాయణలు గురువారం పాఠశాల పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం చేయూతనందించారు. వార్షిక పరీక్షలు పూర్తయ్యేంతవరకు అల్పాహారం అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, మంజుల, పీడీ సోమయ్య, యాదగిరి, ఇందిర, ఉమ, ప్రసన్న, రాజ్యలక్ష్మి, రజని, వెంకటేశ్వర్లు, లింగస్వామి, సంపత్, వీరప్రసాద్, వెంకట్, చంద్రకళ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కరపత్రాలు విడుదల

అర్వపల్లి : నకిరేకల్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో రేపు (శనివారం) తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాదిగ డైరీ బహూకరణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం అర్వపల్లిలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య, టీపీపీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధైద రవీందర్, కొండేటి మల్లయ్య, యాతాకుల శేఖర్, బాలుమహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మద్దిరాల : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నూతనకల్లు మండలంలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన గోగుల మధు తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లి–సూర్యాపేట రహదారిలో స్వగ్రామానికి వస్తుండగా మండల పరిధిలోని పోలుమల్ల గ్రామసమీపంలోకి రాగానే లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మధుకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎస్ఐకి గ్రామస్తుల సన్మానం

తుంగతుర్తి : మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఏడుకొండల్‌ను గురువారం రావులపల్లి గ్రామస్తులు, నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో భాస్కర్‌రావు, స్వామి, యాకన్న, రామచంద్రు, సుందర్‌రావు, చిరంజీవి, స్వామిదాస్ ఉన్నారు.

అర్వపల్లి ఎస్ఐకి

అర్వపల్లి : అర్వపల్లి నూతన ఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ఇందనూరి మహేందర్‌నాథ్‌ను గురువారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వారి వెంట గంగదెరి శ్రీనివాస్, కొమ్మాల ఎంపీటీసీ బిక్కునాయక్, బచ్చుటి ప్రవీణ్ ఉన్నారు.

కుటుంబానికి పరామర్శ

నూతనకల్ : మండల పరిధిలోని సోమ్లాతండా మాజీ సర్పంచ్ అప్పానాయక్ మాతృమూర్తి జాటోతు జాంకీ ఇటీవల మృతి చెందింది. గురువారం ప్రభుత్వ విప్ రామచందర్‌నాయక్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాగం జయసుధ, సుధాకర్‌రెడ్డి, జయాకర్, కృష్ణారెడ్డి, సజ్జనాయక్ ఉన్నారు.

విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలి



చివ్వెంల(సూర్యాపేట) : పరీక్ష నిర్వహిస్తున్న సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు



తిరుమలగిరి (తుంగతుర్తి) : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శాంతయ్య



నాగారం : ఫణిగిరిలో టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ

నాగారం : విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని స్థానిక ఎంఈఓ బి.బాలునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సాంఘీక శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో సాంఘీకశాస్త్రం సబ్జెక్ట్‌పై మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష ప్రశ్నపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ.. విద్యార్థులు సాంఘీకశాస్త్రంపై పట్టు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. టెన్త్ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వాసం ప్రభాకర్, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎం నారాయణ, మండల సాంఘీకశాస్త్రం ఫోరం ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

చివ్వెంల(సూర్యాపేట) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు మండల వ్యాప్తంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 30మంది విద్యార్థుల పాల్గొని తమ ప్రతిభను చాటారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన కుడకుడ, బి.చందుపట్ల, వట్టిఖమ్మంపహాడ్ గ్రామాల విద్యార్థుల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వారు ఈనెల 3న జిల్లాస్థాయిలో నిర్వహించే టెస్ట్‌లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సాంఘీకశాస్త్ర ఫోరం నాయకులు సీహెచ్ వెంకటేశ్వర్లు, వై.రమేష్, రామినేని వెంకటయ్య, మేరిలా, సంఘమిత్ర, బాష పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి టాలెంట్ టెస్టు లు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రథమ స్థానంలో గుండెపురి పాఠశాల విద్యార్థిని మౌనిక, ద్వితీయ స్థానంలో వెలిశాల పాఠశాలకు చెందిన హరిప్రసాద్, కేజీబీవీ పాఠశాలకు చెందిన డి.దివ్య, తిరుమలగిరి ఉన్నత పాఠశాలకు చెందిన పి.మనోజ్ నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, పాఠశాల హెచ్ఎం దామెర శ్రీనివాస్, మంగతాయమ్మ, అన్నపూర్ణ, జానయ్య, సంజీవ్, హుస్సేన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు



తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు సన్మానం



తుంగతుర్తి : తుంగతుర్తిలో సర్పంచ్ స్వరూప, వార్డుసభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : ప్రజలకు తగిన సేవలు అందించడంతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. గ్రామపంచాయతీల పాలకవర్గం పదవీకాలం ముగియడంతో మండలంలోని కొమ్మాల సర్పంచ్ గంగదెరి వెంకటమ్మ, కోమటిపల్లి సర్పంచ్ జాల నర్సయ్య, కొమ్మాల ఉపసర్పంచ్ కుంట్ల రేణుకగోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, సూరారపు రవి, బచ్చుటి ప్రవీణ్, మాదం వీరారెడ్డి, రామిడి వెంకట్‌రెడ్డి, మండడి కృష్ణారెడ్డి, గంగదెరి శ్రీనివాస్, వీరభద్రం, విజయ్‌రెడ్డి, ఉదయ్, వెంకటయ్య, సైదులు, ప్రభా కర్‌రెడ్డి, విఠల్, శ్రీను, గోపాల్, మధుసూదన్‌రెడ్డి, హేమంత్, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్‌కు ఘన సన్మానం

గ్రామపంచాయతీల పాలకవర్గం పదవీకాలం పూర్తికావడంతో గురువారం అర్వపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య, మాజీ ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, మాజీ వార్డుసభ్యులను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, దేవస్థాన మాజీ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి మాగి నాగయ్య, వార్డుసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత సంకినేని కుటుంబానిదే

తుంగతుర్తి : తుంగతుర్తి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సంకినేని కుటుంబానికే దక్కుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లె పాక సాయిబాబు అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి సర్పంచ్ సంకినేని స్వరూపరవీందర్ దంపతులను, వార్డుసభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో తుంగతుర్తి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కాసం మల్లయ్య, ఓరుగంటి సత్యనారాయణ, పాలవరకు సంతోష్, జాన్, పురుషోత్తం, మాధవరావు, పెండెం రాంమూర్తి, ఎంపీటీసీ ఉప్పుల పద్మలింగయ్య, నాగరాజు, రమేష్, నరేష్, యువజన నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌ల పాలన గురువారం ముగియడంతో మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, ఎంపీటీసీలు, మండల పంచాయతీ అధికారి మారయ్య, పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్, శిల్పికా, రణధీర్‌రెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి సర్పంచ్ సునీత దంపతులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

నాగారం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) సంఘం డైరీ, 2024 సంవత్సర క్యాలెండర్లను గురువారం స్థానిక ఎంఈఓ బి.బాలునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, బలోపేతానికి డీటీఎఫ్ సంఘం ముందుంటుందన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆనందభాస్కర్, మండల అధ్యక్షుడు బి.వెంకటమల్లు, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, గుడిపాటి నరేష్, గిరీశం, ఎండీ.రఫీ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ బాలునాయక్, సంఘం నాయకులు

దాబాల్లో మద్యం విక్రయించరాదు

సూర్యాపేట క్రైం : దాబాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని పట్టణ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం రాత్రి పట్టణంలోని జనగాం క్రాస్‌రోడ్డు అంజనాపురి కాలనీలోని దాబాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాలతో దాబాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అదే విధంగా బహిరంగంగా మద్యం తాగుతున్న 21మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

మద్దిరాల : మండలానికి శుక్రవారం ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట పచ్చిపాల వెంకన్న, పాక అమృతమల్లు, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, ఉపేందర్ పాల్గొన్నారు.

అందరికి ఆమోదయోగ్యంగా కేంద్ర బడ్జెట్

అర్వపల్లి : అందరికి ఆమోదయోగ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సోలార్ విద్యుత్ వినియోగం తెచ్చేందుకు ప్రతి కుటుంబానికి 300యూనిట్ల వరకు సబ్సిడీ ఇవ్వడం, ఆయుష్మాన్ భారత్ కింద చెల్లించే రూ.5లక్షలను రూ.7లక్షల వరకు పెంచడం సంతోషకరమన్నారు. పన్ను రాయితీ రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచారని తెలిపారు. ఈ బడ్జెట్ దేశంలో 90శాతం మంది ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఆయన వెంట పగిళ్ల శంకర్, కూర శంకర్, రాములు, నాగయ్య ఉన్నారు.

బస్సు సౌకర్యం లేక విద్యార్థుల ఇబ్బందులు

నాగారం : సూర్యాపేట నుంచి గోరెంట్ల, కొత్తగూడెం, తుంగతుర్తి, పసునూర్ మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసును నిలిపివేయడంతో మోడల్‌స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ కుంట రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పసునూర్‌లోని ఆదర్శ పాఠశాలకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారని, గోరెంట్ల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసు కొన్ని రోజులుగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఆటోలను, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి సమయానికి పాఠశాలకు చేరుకోలేక పోతున్నారని అన్నారు. అధికారులు స్పందించి గోరెంట్ల నుంచి హైదరాబాద్ బస్సు సర్వీసు యథావిధిగా కొనసాగించాలని కోరారు.